# చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయొద్దు

### -మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య

**గజ్వేల్ టౌన్, జూన్ 4 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని ప్రజలు చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని, మున్సిపల్ నుండి వచ్చే చెత్త సేకరణ వాహనాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పేర్కొన్నారు. వంద రోజుల కార్యాచరణ-ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు బుధవారం మున్సిపల్‌లోని పలు వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం అయినందున చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయడం వల్ల దోమలు పెరిగిపోయి డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కావున ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. అలాగే మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్‌పల్లి బరిచెరువు వద్ద జెసిబి యంత్రంతో ముళ్ల పొదలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యాలయ విభాగ అధికారులు, వార్డు ఆఫీసర్, మెప్మా ఆర్‌పిలు, ఎస్‌హెచ్‌జి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

# ఆరేపల్లిలో ఘనంగా బీరప్ప జాతర

**పాపన్నపేట, జూన్ 4, ప్రభాతవార్త:** జాతర ఉత్సవాలు సాంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు ఆయన బుధవారం పాపన్నపేట మండలం ఆరేపల్లిలో నిర్వహిస్తున్న బీరప్ప జాతరలో పాల్గొన్నారు. ఆయన వెంట కొత్తపల్లి సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్, మాజీ జెడ్పిటిసి లింగన్న గారి మల్లప్ప, మండల నాయకుడు గోవింద్ నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్, బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు



హనుమంతరావు సన్మానిస్తున్న నిర్వాహకులు




ప్రపంచ పర్యావరణ దినోత్సం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

## పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి : కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసినప్పుడే బావితరాలకు మంచి గాలి, నీరు,నేల అందించే వారమవుతామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండల ప్రాంతీయ కార్యాలయ ఆర్‌సిపురం సహాయ పర్యావరణ శాస్త్రవేత్త టి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



కొర్విపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**చిన్నశంకరంపేట, జూన్ 4,ప్రభాతవార్త:** భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం మండల పరిధి కొర్విపల్లిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొన్నేళ్లుగా భూ వివాదాలు, చేర్పులు, మార్పులు ఉన్న కారణంగా వివాదాలు ఉంటే ఈ రెవెన్యూ సదస్సులో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే సదస్సులో ధరఖాస్తులు అందిస్తే, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్ధార్ మన్నన్, ఉప తహసీల్ధార్ ప్రభు, మండల ఆర్ఐ రాజు, ఆనంద్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే



ఇళ్ల మంజూరుపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, జిల్లా అదనపు కలెక్టర్

**బెజ్జంకి, జూన్ 4, ప్రభాతవార్త :** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మంజూరు పొందిన లబ్ధిదారులు 45 రోజుల్లో ఇండ్ల నిర్మాణం చేపట్టాలని లేదంటే రద్దుయ్యే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ దామోదర్‌రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ కడవెర్గు ప్రవీణ్, ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, బైర సంతోష్, అక్కరవేణి పోచయ్య, గూడెల్లి శ్రీకాంత్, లింగాల శ్రీనివాస్, పోతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, శాగొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ మేళాకు గట్టి పోలీసు బందోబస్తు : ఎసిపి

**హుస్నాబాద్ రూరల్, జూన్ 4,ప్రభాతవార్త :** హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఈనెల 6,7,8వ తేదీలలో నిర్వహించ తలపెట్టిన కిసాన్ మేళ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ సదానందం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మార్కెట్ కమిటీలో బందోబస్తు, విఐపిలు,రైతుల గ్యాలరీ,వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. మూడు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన కిసాన్ మేళాకు మంత్రులు, రైతులు పెద్దయెత్తున్న పాల్గొనే అవకాశం ఉందన్నారు. మేళాకు వచ్చే ప్రతినిధులుకు, రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేష్‌కు సూచించారు.



విఐపిల, రైతు గ్యాలరీ పరిశీలిస్తున్న ఎసిపి

# భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**కొండపాక, జూన్ 4, ప్రభాతవార్త**

రైతుల భూముల భూ సమస్యల పరిష్కరానికే భూ భారతి చట్టం వచ్చిందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. బుధవారం కొండపాక మండల పరిధిలోని ఖమ్మంపల్లిలో రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. రైతులకు భూ సమస్యలుంటే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులు ఆయనను కలిసి మర్పడ్గ నుండి ఖమ్మంపల్లి వరకు గతంలో వేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, బిటి రోడ్డు వేయించాలని కోరారు. దానికి స్పందించిన కలెక్టర్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ వై.శ్యామ్, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య అర్.బాలకిషన్, సినియర్ అసిస్టెంట్ సురేష్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఖమ్మంపల్లి గ్రామంలో మెత్తం 66 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా కుకునూరుపల్లి మండల పరిధిలోని పిటి వెంకటపూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించగా 38 దరఖాస్తులు వచ్చాయని, ఎల్లయగూడలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 34 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ దండి సుజాత తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంపల్లి రెవెన్యూ సదస్సులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# పేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం పంపిణీ

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**చిన్నశంకరంపేట, జూన్ 4,ప్రభాతవార్త:**

పేదవాడి కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు.బుధవారం చిన్నశంకరంపేటలోని చౌకధరల దుకాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సన్నబియ్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. చౌక ధరల దుకాణాలలో సకాలంలో వినియోగదారులకు రేషన్ బియ్యం ఇతర వస్తువులను పంపిణీచేయాలని చెప్పారు.సంబంధిత రికార్డులలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 3 నెలల బియ్యం ఒకేసారి అందిస్తున్న నేపథ్యంలో బయోమెట్రిక్ ద్వారానే రేషన్ పంపిణీ జరగాల తెలిపారు. దుకాణానికి సంబంధించిన నిల్వల వివరాలను బోర్డులు, ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. పేదవారికి సన్న బియ్యం పంపిణీ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని అమలు చేస్తుందని, సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలకు జరిగినా కఠిన చర్యలు తప్పవని రేషన్ డీలర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్ధార్ మన్నన్, డీలర్లు తుమ్మ శంకర్, నర్సింలు సంబధిత అధికారులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

#### నకిలి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

నకిలి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలుంటాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం మండల పరిది గవ్వలపల్లిలో ఎరువులు, సిమెంట్ దుకాణాలను తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. సిమెంట్ వినియోగదారులకు సరసమైన ధరలకు అందించాలన్నారు. ఎరువుల నిల్వల వివరాలను బోర్డులో నమోదు చేసి ఉండాలన్నారు. పురుగు మందులు తీసుకున్న రైతుల వివరాలు ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని చెప్పారు. అంతకుముందు కొర్విపల్లిలోని పల్లె దవఖానాను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవిణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

### హాజరైన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత రెడ్డి

**శివ్వంపేట, జూన్ 4 (ప్రభాతవార్త) :** మండల పరిధిలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీగురుపీఠంలో శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం రమాదేవి శివకుమార్‌గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో దత్తాత్రేయ, సాయిబాబా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమాలు రెండవ రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి మాజీమంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సుతారెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ ఎఫ్ డి సి చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొని దత్తాత్రేయ మహాస్వామి, షిరిడి సాయిబాబా విగ్రహాలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసిన అతిథులందరినీ శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, మాజీ జెడ్పిటిసి పబ్బా మహేష్ గుప్తా, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్, సీనియర్ నాయకులు యాద గౌడ్, కృష్ణారావు, సంతోష్ రెడ్డి, శ్రీ గురు పీఠం ట్రస్టు సభ్యులు రాజం బిక్షపతి, హనుమంత్, మాజీ సర్పంచులు పత్రాల శ్రీనివాస్ గౌడ్, కన్నారం దుర్గేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే సునీతరెడ్డి

# అంతరాలు లేని సమాజమే సిపిఐ లక్ష్యం

### పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్

**గజ్వేల్, జూన్ 4 (ప్రభాతవార్త):** భూమి కోసం భుక్తి కోసం శ్రామిక జనవిముక్తి కోసం సమ సమాజ స్థాపనే ధ్యేయంగా అంతరాలు లేని సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గత వంద సంవత్సరాలుగా పనిచేస్తుందని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. బుధవారం సిపిఐ గజ్వేల్ మండల 17వ మహాసభ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని ఇందిరా పార్కు చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా మీదుగా కోల అభిరాం గార్డెన్ వరకు పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఐ సీనియర్ నాయకులు బట్టు దయానందరెడ్డి సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మంద పవన్ మాట్లాడుతూ దేశంలో పీడితుల పక్షాన పోరాడుతున్న కమ్యూనిస్టులపై మేధావులపై ఉప చట్టాలను ప్రయోగిస్తూ జైలులో నిర్బంధిస్తున్నారని, సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపడం కోసం పాలక ప్రభుత్వాలను ప్రశ్నించనంత మాత్రాన ఈ దేశంలో ఉండకూడదనే ముద్ర వేస్తున్నారని, ఆర్ఎస్ఎస్ సంగ్ పరివార్ శక్తులు నిరంతరం దళితుల మీద, ఆదివాసిల మీద, దేశ ప్రజల మీద దాడి చేస్తూ మతం పేరుతో కులం పేరుతో కుట్రలు చేస్తూ మసీదులను, చర్చిలను కూల్చాలని నినాదాలు చేస్తూ కల్లోలాలు సృష్టిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. మధ్య భారతంలో ఛత్తీస్‌ఘడ్ ఏటబి ప్రాంతాలలో ఉన్న అపారమైన ఖనిజ సంపదలను కార్పొరేట్ పెట్టుబడి దారి వర్గాలకు అప్పజెప్పడం కోసం ఆపరేషన్ గ్రీన్ హంట్ అదేవిధంగా ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీలను, గిరిజనులను నక్సలైట్ల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తూ ఎన్‌కౌంటర్ చేస్తున్నారని చెప్పారు. పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో యుద్ధం చేసే సందర్భంలో అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాళ్ల కింద భారతదేశ ఆత్మగౌరవాన్ని నరేంద్రమోడి తాకట్టు పెట్టాడని అన్నారు. ఉగ్రవాదులతో పాకిస్తాన్‌తో కాల్పులవిరమణ ఒప్పందాన్ని కుదుర్చుకున్న ప్రభుత్వం 50 ఏళ్ల నుండి ఈ దేశంలో అంతరాలు లేని సమాజం కోసం ఆదివాసుల పక్షాన పోరాడుతున్న మావోయిస్టులతో శాంతి చర్చలు చేయకుండా ఈ మధ్య ఆ పార్టీ కేంద్ర కార్యదర్శిని ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ఆదివాసుల గిరిజనుల ప్రాంతాలలో సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి గజ్వేల్ ప్రాంతంలో ముంపు గ్రామాల బాధితుల సమస్యల పరిష్కారంలో విఫలమైందని ఇప్పటికైనా ముంపు గ్రామాల బాధితుల సమస్యలు ఆర్అండ్ఆర్ కాలనీకి వెళ్తే కనిపిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టాపురం లక్ష్మణ్, ఎడల వనేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, శివలింగు కృష్ణ, జెగ్రిపోతుల జనార్ధన్, నర్సింహారెడ్డి, రామగల్ల నరేష్, హమాలీ సంఘం నాయకులు లక్ష్మణ్, కానుగుల రమణాకర్, మిట్టపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. మహాసభ అనంతరం గజ్వేల్ మండల, పట్టణ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా శివలింగు కృష్ణ, సహాయ కార్యదర్శులుగా కొండకింది పోచయ్య, మెట్టు శ్రీను, పట్టణ కార్యదర్శిగా సర్గం రాజేశం, సహాయకార్యదర్శిగా కానుగుల రమణాకర్, సభ్యులుగా బొట్ల సాయి, పిట్ల ఎల్లం, కొరమైన నర్సింలు,దాసరి యాదయ్య, ఉప్పరి యాదగిరి, గూడూరు బాల్‌నర్సయ్యలను ఎన్నుకున్నారు.




మాట్లాడుతున్న మంద పవన్



సింగూరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్

## ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

### సంగారెడ్డి జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్

**పుల్‌కల్, జూన్ 4, ప్రభాతవార్త:** నాణ్యమైన ఇన్వెస్టిగేషన్‌ను త్వరిత గతిన పూర్తిచేయాలని జిల్లా ఎస్‌పి పరితోష్‌పంకజ్ అన్నారు. మంగళవారం పుల్‌కల్‌లోని పోలీసు ఠాణాను, సింగూర్ ప్రాజెక్టును ఎస్‌పి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల చేదనకు ప్రత్యేక ప్రణాళిక ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు ఠాణాకు వచ్చిన ఫిర్యాదు దారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా మాట్లాడాలని ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు రౌండ్ ద క్లాక్‌గా సేవలు అందించాలన్నారు. నూట్ బీట్, పెట్రోలింగ్ అధికారులు విధి నిర్వాహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. హిస్టరీ షీటర్లు, సస్పెక్ట్, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. సివిల్, భూ సంబంధిత కేసులలో పోలీసులు తలదూర్చవద్దని హెతువు పలికారు. ఆన్‌లైన్, సైబర్‌మోసాలపై ప్రజలకు తరచూ అవగాహన కల్పిస్తూ ఉండాలని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాని, తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాలను బ్లాక్ స్పార్ట్‌లుగా గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

#### సింగూర్ ప్రాజెక్టు పరిశీలన...

గలగల పారే సింగూరు ప్రాజెక్టును జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ పరిశీలించారు. సింగూరు ప్రాజెక్టు అందాలను ఆస్వాదించేందుకు వచ్చే పర్యాటకులు ప్రమాదాలకు లోనుకాకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు బాధ్యులకు సూచించారు. ప్రాజెక్టులోకి నిత్యం వచ్చే ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో, ప్రస్తుత నీటి మట్టం వివరాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌పి వెంట జోగిపేట సిఐ అనిల్‌కుమార్, పుల్‌కల్ ఎస్ఐలు ఉన్నారు.

## విధుల్లో చేరని గిర్దావర్-బదిలీ ఉత్తర్వులు బేఖాతరు

### -స్పందించని అధికారులు-ఇబ్బందులో ప్రజలు



**చౌటకూరు, జూన్ 4, ప్రభాతవార్త:** అధికారులు అందరు ఉంటేనే పనులు త్వరగా పూర్తికాని రోజుల్లో బదిలీ ఉత్వర్వులు అందుకుని నెల రోజులు గడిచినా విధుల్లో అధికారి చేరలేదంటే ఆ మండల ప్రజలు పడుతున్న పాట్లు ఎలాగుంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే...కొండాపూర్ మండలంలో గిర్దావర్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లంరాజును డిప్యూటేషన్‌పై మండలానికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మల్లంరాజు తన పనులను తాను సక్రమంగా నిర్వహిస్తున్న తరుణంలో కొండాపూర్ మండలాన్ని భూ భారతి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడంతో మల్లంరాజు డిప్యూటేషన్‌ను ఉన్నతాధికారులు రద్దుచేసి గుమ్మడిదల మండలంలో గిర్దావర్-2గా విధులు నిర్వహిస్తున్న కేటీ పవన్‌కుమార్‌ను చౌటకూరు మండలానికి డిప్యూటేషన్‌పై వెళ్లాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) మాధురి మే 3వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను అధికారి పవన్‌కుమార్ బేఖాతరు చేస్తూ నెల రోజులు గడిచినా ఇంతవరకు విధుల్లో చేరలేదు. గిర్దావర్ విధుల్లో చేరకపోవడంతో ప్రజలు వారసత్వ, పౌతి మార్పు, కుల, ఆదాయ, నివాస, ఈబీసీ తదితర దృవపత్రాలు అందుకునేందుకు పరేషాన్ కాక తప్పడంలేదు. మండలంలో రెవిన్యూసదస్సుల కొనసాగుతున్నందున ప్రజలతోపాటు రెవెన్యూ అధికారులు సైతం గిర్దావర్ లేక అవస్థలు పడాల్సి వస్తుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు జిల్లా కలెక్టర్ స్పందించి గిర్దావర్ కేటి పవన్‌కుమార్ విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు వినతి చేస్తున్నారు.

## కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు

**కొండాపూర్, జూన్ 4(ప్రభాతవార్త):** కొండాపూర్ మండలం మల్లెపల్లిలోని హనుమాన్ దేవాలయంలో శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్ సహిత శివవర్త నంది సిద్ధివినాయక సుబ్రమణ్యేశ్వర నాగదేవత ధ్వజస్థంభ ప్రతిష్టా పన మహోత్సవం వైభవంగా జరిగింది. బుదవారం రుత్వికులు, గ్రామ స్థులు, భక్తుల మధ్య మండవ పూజ, అవాహిత దేవతా హోమం, మూల మంత్ర హోమం, ఆదివసాంగ హోమం, మంగళహారతి, మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

## గంజాయి విక్రేతల అరెస్ట్

**చేర్యాల, జూన్ 4,ప్రభాతవార్త :** మండలంలోని రాంపూర్ గ్రామంలో గంజాయి విక్రయిస్తూ, సేవిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం సిఐ శ్రీను, ఎస్సై నీరేష్ తెలిపిన వివరాల ప్రకారం. కొమురవెల్లి గ్రామానికి చెందిన సింగారం మహేష్, సార్ల నవీన్, చేర్యాల మండలం రాంపూర్ గ్రామానికి చెందిన రంగు రాజు ముగ్గురు యువకులు చేర్యాల మండలంలోని రాంపూర్ గ్రామంలో గంజాయి విక్రయిస్తూ,సేవిస్తున్నారని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులకు,చేర్యాల పోలీసులకు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వారి నుండి 100 గ్రాముల గంజాయి ఫ్యాకెట్లు,మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ శ్రీను,ఎస్సై నీరేష్

## పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం : కమిషనర్ శరత్‌చంద్ర

**నార్సింగి, జూన్ 4 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో పరిసరాల పరిశుభ్రత-ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని కమీషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. బుధవారం కార్పోరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆయన పర్యటించి ప్రభుత్వం ఆదేశించిన యాక్షన్ ప్లాన్‌పై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వార్డు ఆఫీసర్లు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆయా వార్డుల పరిధిలో ఉన్న సమస్యలను తెలుసుకొని నా దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ముఖ్యంగా వచ్చే వర్షా కాలంలో ప్రజలు ఇబ్బందుల పాలవకుండా, అనారోగ్యం పాలవకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. నాలాల్లో పూడికలు తీయించాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని, చెత్త రోడ్లపై వేయకుండా ప్రజలకు మరింత అవగాహన పెంచాలని తెలిపారు. ప్రజల సహకారం ఉంటేనే ఏ కార్యక్రమమైనా విజయవంతం అవుతుందని, కాలనీ సంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలకు చెందిన ప్రజల సేవలు వినియోగించుకోవాలని కమిషనర్ శరత్‌చంద్ర సిబ్బందికి సూచించారు. వరద



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో వందరోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో పాల్గొన్న కమీషనర్ బి.శరత్‌చంద్ర దృశ్యం

నీరు రోడ్లపై నిలువ కుండా చూడాలని, మ్యాన్‌హోళ్లు, నాలాలు పొంగి పొర్లకుండా సాఫీగా వరద నీరు కిందికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, డ్రైనేజి, వీధి దీపాలు, మంచినీరు వంటి ప్రధాన సమస్యలు తలెత్తకుండా పకడ్బంధీగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఇ యాదయ్య, వెంకట్‌రెడ్డి, వర్క్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.

## ప్రజల్లో ఆధ్యాత్మికభావాలు వెల్లివిరియాలి

**చిక్కడపల్లి, జూన్ 4 ప్రభాతవార్త:**
ప్రజల్లో ఆధ్యాత్మికభావాలు వెల్లివిరియాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ సబర్మతినగర్‌లో నిర్మించిన శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ విగ్రహాల పున:ప్రతిష్టాపన మహోత్సవాలు బుధ వారం అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. నల్ల పోచమ్మ దేవాలయ ధర్మ కర్తల మండలి సభ్యులు కే నర్సింగరావు, జీ వై గిరి, జీ నర్సింగరావు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. బుధ వారం గణపతి పూజతో ప్రారంభమై వరుసగా కలశ స్థాప న, అగ్నిప్రతిష్టాపన, పంచగ వ్యాదివాసము, క్షీరాధివాస ము, జలాదివాస కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మండలి సభ్యులు రాజు, చం దు, సంతోష్, రాము, కుమార్, యాదగిరి, లక్ష్మణ్, బిఆర్ ఎస్ నాయకులు ముఠా నరేష్, శ్రీకాంత్, రాజ్ కుమార్, ఎండి గౌస్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు కాగా గురు వారం ధాన్యాదివాసము, ఫలాధివాసము, హోమం, హారతి భక్తులకు తీర్థప్రసాద వితర ణ , సాయంత్రం పుష్పాదివాసము, సేయాదివాసము, హారతి ఉంటుందని వివరించారు. 6న విగ్రహప్రతిష్ట అనంతరం శాంతి కల్యాణం అనంతరం కలశ ఉద్వాసన, మహాపూ ర్ణాహుతి, హారతి ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు

## కన్నుల పండువగా వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం

**యూసుఫ్‌గూడ, జూన్ 4,**
**ప్రభాతవవార్త :**
అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానందనగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో శ్రీ భూనీల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్స వాలలో భాగంగా బుధవారం అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే సుప్రభాత సేవ, నిత్యారా ధనలు, యాగశాలలో ద్వారాతోరణ, ధ్వజ కుంభారాధన, చక్రస్థాన అర్చన, పూర్ణాహుతి, నిత్యహోమం, బలిహరణంతో పాటు శ్రీ వెం కటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం కనుల పండుగగా జరి గింది. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ని ర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను కాలనీ పురవీధుల ల్లో ఊరేగింపు సేవ నిర్వహించారు. ఈ ఉత్సవాలను మేడ్చల్ మ ల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ ప్రారంభించగా స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో నియోజకవర్గం ఎమ్మెల్యే మాదవర కృష్ణారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వాడివేడిగా 'జిహెచ్‌ఎంసి కౌన్సిల్ మీటింగ్ '

**-సమస్యలపై అధికార, విపక్షాల మధ్య చర్చ**
**-స్పోర్ట్స్,వీధిదీపాలు, టౌన్‌ప్లానింగ్‌లపైనే సభ్యుల ప్రశ్నలు**
**-మొదటిసారిగా మేయర్‌గా వ్యవహరించిన డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి**



**హైదరాబాద్, జూన్ 4,ప్రభాతవార్త:**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 11వ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా జరిగింది. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశానికి బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం, కార్పొరేటర్లతోపాటు ఎక్స్ అఫిషియో సభ్యులుగా మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్, మెదక్ ఎంపి రఘునందన్ రావులతోపాటు గ్రేటర్‌పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ కమిషనర్ ఆర్.వి కర్ణన్, అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు హాజరయ్యారు. ఉదయం 10.30గంటలకు సభ ప్రారంభం కాగా రాత్రి 7గంటలకు ముగిసింది. సభ ప్రారంభం కాగానే పహల్గామ్ మృతులకు సభ్యులు నివాళ్లు అర్పించారు.ఈ దాడిలో మరణించిన కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈసందర్బంగా మేయర్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీలో చేపట్టే మౌలిక సదుపాయాల అభివృద్ధికి, సంక్షేమానికి నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చి నిధులు మంజూరు చేస్తూ బల్దియా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తావించారు. నగర ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. అందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. నగరంలో ముందస్తు మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ వలన ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి గల్లీని పరిశుభ్రం చేయడమే ప్రధాన లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి పరిశుభ్రమైన నగరంగా ఉండేందుకు దోహద పడుతుందని, అందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్లమెంటు సభ్యులను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని అధికారులను కోరారు. నగరంలో ప్రజా సమస్యలను పరిష్కరించటకు జోనల్ వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, ముందుగా ఎల్బీనగర్ జోన్ లో నిర్వహించి ఆ సమావేశంలో కార్పొరేటర్లు అడిగిన సమస్యల పరిష్కారం కోసం తగు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. మిగతా జోన్ లలో కూడా శానిటేషన్, డిసిల్టింగ్, నాలా అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేసేందుకు అధికారులతో కార్పొరేటర్లు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మేయర్ వివరించారు.

మొఘల్ పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రభుత్వ కార్యాలయం ఉన్నందున క్రీడలకు అంతరాయం ఏర్పడుతుందని, క్రీడాకారులు తయారు కావడానికి కార్యాలయాన్ని వెంటనే అక్కడి నుండి తొలగించాలని సయ్యద్ సోహెల్ ఖాద్రీ కోరారు. ఈ విషయం పై కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోయినుద్దీన్ జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ మెటీరియల్ ను, సమ్మర్ కోచింగ్ లో కాకుండా ముందస్తుగా ఇవ్వాలని తెలిపారు. ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ మాట్లాడుతూ కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను కూడా అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నందున యువత క్రీడల్లో రాణించాలన్నారు. అంబర్ పేట్ కార్పొరేటర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ... అంబర్ పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో కోచ్ లేడని తెలిపారు. వనస్థలిపురం ప్రభుత్వ ప్లే గ్రౌండ్ లో ప్రైవేట్ వ్యక్తులు స్కేటింగ్ రుసుం వసూలు చేస్తున్నారని కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

**డబుల్‌బెడ్‌రూం ఇళ్లు స్థానికంగానే ఇవ్వాలి : ఎంపి ఈటెల రాజేందర్**
గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతంలో పేద వాళ్లు ఎక్కువగా ఉన్నారని, ఇందిరమ్మ ఇళ్లను స్థానిక ప్రదేశంలో ఇవ్వాలని, దూర ప్రదేశంలో ఇవ్వవద్దని ఈటెల రాజేందర్ తెలిపారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో మౌలిక వసతులు సరిగా లేవని అందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని తెలిపారు. నగరంలో ఏర్పడే కొత్త కాలనీలలో భవిష్యత్తు ప్రణాళికతో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఎస్.ఎన్.డి.పి ద్వారా నాలా అభివృద్ధి పనులు చేపట్టాలని, పార్కు స్థలాలను కాపాడాలని, జలమండలి, జీహెచ్‌ఎంసి సమన్వయంతో వర్షాకాలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైల్వే లైన్ల ద్వారా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నివారించడానికి అండర్ పాస్ ల నిర్మాణానికి రైల్వే శాఖ రాష్ట్ర ప్రభుత్వంతో కంట్రిబ్యూషన్ లేకుండా నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. బొల్లారం వద్ద నిధులు మంజూరై ఇప్పటికి 20 ఏళ్లు అయినా ఇంకా ప్రారంభించలేదని అన్నారు. నగరంలో ఆఫీస్ లో కంటే ట్రాఫిక్ లో ఇబ్బందుల పడుతున్నారని తెలిపారు. అలాగే ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో అధికార భాష ఉర్దూ ఉన్నందున అధికారులు వెంటనే ప్లైఓవర్లకు ఉర్దూ భాషలో పేర్లు పెట్టాలని ఆయన కోరారు.

**మొట్టమొదటి సారిగా మేయర్‌గా**
**డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి..**
డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మొట్టమొదటి సారిగా సభకు అధ్యక్షత వహించారు.ఈసందర్బంగా ఆమె బర్త్ అండ్ డెత్ అంశం పై చర్చ నిర్వహించారు. సభ్యులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు అధికారులతో సమాధానం ఇప్పించారు. టీ బ్రేక్ అనంతరం తిరిగి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షత వహించి సమావేశానికి కొనసాగించారు. ఈ సమావేశంలో జపాన్ బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సమావేశం పూర్తయ్యే వరకు వారు సభ తీరును పరిశీలించారు.ఈ సమావేశంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, శానిటేషన్, బర్త్ అండ్ డెత్, వీధి లైట్లు, అడ్వర్టైజ్మెంట్, డిసిల్టింగ్ తదితర అంశాలపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయా విభాగాల అధికారులు వివరణ ఇచ్చారు.ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు విజయశాంతి, బల్మూరి వెంకట్, మిర్జా రియాజ్ ఉల్ హస్సన్ ఎఫెంది, మిర్జా రహమత్ బేగ్, అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు జుల్ఫికర్ అలీ, మాజీద్ హుస్సేన్, కౌసర్ మొయినుద్దీన్, రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కమీషనర్ ఆర్.వి.కర్ణన్, అడిషనల్ కమీషనర్లు స్నేహ శబరీష్, వేణుగోపాల్, వేణుగోపాల్ రెడ్డి, పంకజ, సుభద్ర, మెయింటెనెన్స్ సి.ఇ సహదేవ్ రత్నాకర్, ప్రాజెక్ట్ సి.ఈ భాస్కర్ రెడ్డి, జోనల్ కమీషనర్లు అపూర్వ్ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్ రావు, రవికిరణ్, వెంకన్న, సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ స్థాయికి మేకలమండి ప్రభుత్వ పాఠశాల నిర్మాణం

**-శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను సత్వరమే తొలగించాలి**
**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, జూన్ 4,ప్రభాతవార్త:**
సికింద్రాబాద్ క్రిష్ణనగర్ కాలనీ మేకలమండి ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు ధీటుగా నిర్మించడంతో పిల్లల సంఖ్యను మరింతగా పెంచాల ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ హైదరాబాద్ లోని పలు ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. తొలుత నాంపల్లి లోని ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలను, సికింద్రాబాద్ కృష్ణానగర్ లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, యూసుఫ్ గూడ లోని ప్రాథమికోన్నత పాఠశాలను అలాగే బోరుబండలో ప్రభుత్వ బాలుర హైస్కూల్ ను సందర్శించి చేపడుతున్న పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ కృష్ణానగర్ మేకలమండి లో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణం అద్భుతంగా ఉందని కాంట్రాక్టర్ కృష్ణారెడ్డిని అభినందించారు. ఈ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయికి తగ్గట్టుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయటం తో పిల్లల సంఖ్యను 1000 కి పెంచాలని ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలోని పిల్లల హాజరు శాతం, ఉపాధ్యాయుల సంఖ్య, ఖాళీల వివరాలు, నీటి వసతులు అడిగి తెలుసుకున్నారు. ఎనిమిదో తరగతి పుస్తకాలను త్వరలో అందిస్తామని అలాగే పాఠశాల గోడలపై విద్య యొక్క ఆవశ్యకత గురించి ఇంగ్లీషు లో స్లోగన్స్ వ్రాయించాలని హెచ్‌ఎం ను ఆదేశించారు. పాఠశాల హెచ్‌ఎం వాల్ పెయింటింగ్స్ అలాగే కాంపౌండ్ వాల్ కు ఐరన్ ఫ్రేమ్ ఏర్పాటు చేయవలసిందిగా కలెక్టర్ కు విజ్ఞప్తి చేయగా సత్వరమే పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.నాంపల్లి లోని ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించి అదే ఆవరణలో గల మూడు పాత భవనాలను కమిటి నిర్ణయం తర్వాత తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు బయటికి వెళ్లే సౌకర్యం లేకపోవడంతో డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ తో తరగతి గదుల్లో చేపట్టిన మరమ్మత్తు పనులు, ఎలక్ట్రికల్ వర్క్స్, మరుగుదొడ్ల మరమ్మత్తులు, త్రాగునీరు ఏర్పాటు అలాగే పాఠశాల ఆవరణలో స్టేజి నిర్మాణం పనులను పరిశీలించి మిగిలి ఉన్న పనులను తత్వరమే చేపట్టాలని బడిబాట కార్యక్రమంలో పిల్లల సంఖ్యను250 మందికి పెంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలోఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీ మియా, డి ఈ ఆశీర్వాదం, తాసిల్దారులు ప్రేమ్ కుమార్, నయిముద్దీన్, పాండు నాయక్, ప్రధానోపాధ్యాయులు రజిని, స్వరూప, గీత, ఎస్ ఎల్ ఎఫ్ భవిత ఉపాధ్యాయులు, మదర్స్ కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు

## చెరువులో చేపల వేటకు వెళ్ళి వ్యక్తి మృతి..

**పేట్ బషీరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త**
చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో గుడ్ల పోచంపల్లిలోని సోకాయికుంట చెరువులో చేపలు పడదామని గుండ్ల పోచంపల్లికి చెందిన చంచల నాగరాజు తండ్రి బాలయ్య (48) వెళ్లగా ఇతనితో పాటు బండారు దేవేందర్, రాజులు కూడా వెళ్ళారు. రాత్రి వేసిన వలలు తీద్దామని వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. ఈ విషయంపై మృతిని భార్య చంచల లలిత ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బ్యాగ్‌లో మహిళ మృతదేహం..



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**కొంపల్లి, జూన్ 4, ప్రభాతవార్త**
గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని బాచుపల్లి పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం బుధవారం విజయదుర్గా ఓనర్స్ అసోసియేషన్ కాలనీ , డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ పక్కన నిర్మానుష్య ప్రాంతంలో ఒక బ్యాగు పడి ఉండడం అందులో నుండి దుర్వాసన రావడంతో స్థానికులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి చూడగా ఆ బ్యాగులో గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం ఉంది. సుమారు 25 నుండి 30 సంవత్సరాల లోపు గల యువతి మెరూన్ కలర్ పంజాబీ డ్రెస్ ధరించి ఉంది. అయితే ఆ మహిళను ఎక్కడో చంపేసి మృతదేహాన్ని బ్యాగులో వేసుకొని ఇక్కడికి తీసుకొచ్చి పడవేసినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలాన్ని బాలనగర్ డిసిపి కే సురేష్ కుమార్ ఐపిఎస్ సందర్శించి స్థానిక పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హత్యగావించబడిన మహిళను గుర్తించడం, అనంతరం హత్యకు గల కారణాలను అన్వేషించి అందుకు కారకులైన వారిని అరెస్టు చేసే దిశగా పోలీసులు ముమ్మర గాలింపును చేపట్టారు. అయితే మృతదేహం కుళ్ళిపోయిన విధానాన్ని బట్టి సుమారు ఐదు రోజులకు ముందే మృతదేహాన్ని ఇక్కడ పడవేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. పరిసరాల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ వయసు గల మహిళల మిస్సింగ్ కేసులను బాచుపల్లి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ హెచ్ ఓ ఉపేందర్ రావు తెలిపారు.

## చెరువుల అభివృద్ధిలో వేగం పెరగాలి

**- హైడ్రా కమిషనర్ రంగనాథ్**



చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఎ.వి రంగనాథ్

**హైదరాబాద్, జూన్ 4,ప్రభాతవార్త:**
చెరువుల అభివృద్ధి పనుల్లో వేగాన్ని పెంచాలని హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ ఆదేశించారు. ఈవర్షాకాలం చెరువులన్నీ స్వచ్ఛమైన నీటితో కళకళలాడాలని సూచించారు. నగరంలో మొదటి విడతగా చేపట్టిన 6 చెరువుల అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఈ క్రమంలో మంగళవారం బతుకమ్మకుంట, భమ్రుక్‌నుద్దౌలా చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ తమ్మిడికుంట, సున్నం చెరువులను బుధవారం సందర్శించారు. అక్కడి పనుల పురోగతిని పరిశీలించారు. 14ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ్మిడికుంటను 26 ఎకరాల మేర నీరు నిలిచేలా.. మరో 4 ఎకరాల్లో పర్యావరణానికి పెద్ద పీట వేయాలని సూచించారు. చెరువు బండ్ బలంగా ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. చెరువు కింద లోతట్టు ప్రాంతంతో పాటు.. భవనాలు ఉన్న దృష్ట్యా బండ్‌కు వెలుపల భాగంలో కాంక్రీట్ గోడ నిర్మించాలన్నారు. పనులకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సున్నం చెరువును కమిషనర్ సందర్శించారు. సున్నం చెరువు మొత్తం 32.20 ఎకరాలు కాగా.. ఇప్పుడు కేవలం 14.18 ఎకరా ల్లోనే నీరు నిలుస్తోంది. దీనిని పూర్తి స్థాయికి విస్తరించాలని అన్నారు. అలాగే చెరువు లోతును కూడా పెంచాలని సూచించారు. ఈ మేరకు చెరువులో మురుగును బయటకు పంపి దుర్గంధభరిత మట్టిని కూడా హైడ్రా తొలగించింది. ఈవర్షాకాలంలో స్వచ్ఛమైన నీరు నిలిచేలా ఏర్పట్లు చేస్తున్నారు.

## అగ్నిప్రమాదంపై 'మాక్‌డ్రిల్'



**హైదరాబాద్, జూన్4, ప్రభాతవార్త:** అగ్నిప్రమాదంపై చేపట్టాల్సిన భద్రత చర్యలు, బాధితుల కాపాడడంపై తూకారంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ భవనంలో బుధవారం 'మాక్‌డ్రిల్' నిర్వహించారు. అగ్నిమాపక శాఖతో సహ ఆయా శాఖలు కలిసి వీలైనంత త్వరగా ఘటనస్థలానికి రావడం, ఒక్కొక్క విభాగం సమన్వయం చేసుకొని జాగ్రత్తలు తీసుకోవడంపై చాలా చక్కగా ప్రదర్శించారు.

# ఫిర్యాదులొస్తే..పండగే...!

**- పలు పోలీస్‌స్టేషన్లలో ఇరువర్గీయుల సెటిల్మెంట్లు**
**- కేసుల్లో తీవ్రత ఉన్న ఎఫ్ఐఆర్ చేయని పోలీసులు**
**- కఠిననేరస్తులను తప్పించడంతో నష్టపోతున్న బాధితులు**

**హైదరాబాద్ జూన్4, ప్రభాతవార్త:** చిన్నపాటి నేరాలైనా...కఠిన దారుణాలైన పోలీసులు తమదైన శైలీలో బాధితులను బుజ్జగించి కరడుగట్టిన నేరస్తులతో రాజీకుదురుస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. నగరంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో కొన్ని పోలీస్‌స్టేన్లు సెటిల్మెంట్లకే ఉపయోగిస్తున్నారని తెలుస్తుంది. కుటుంబ గొడువల నుంచి హత్యలు, అత్యాచారాలు, వివిధ రకాల నేరాలను సైతం నిందితులను తప్పించి భారీస్థాయిలో సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇక రాజకీయ నేతల అండదండలు, సంపన్న వర్గాల పిల్లలు, ఇతర పైరవీలతో నేరస్తులను తప్పించి శాంతిభద్రతల సమస్యలను పెంచుతున్నారని తెలుస్తుంది. సాధారణంగా ఫిర్యాదు వస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. అలా కాకుండా చట్టానికి విరుద్ధంగా కొందరు పోలీసులు వ్యవహరించడంతో అక్రమార్కులు, నేరస్తులు మరింతగా రెచ్చిపోయి దౌర్జాన్యాలకు పాల్పడుతున్నారు. దర్యాప్తులు, విచారణలు లేకుండా తీవ్రమైన కేసులను కూడా లైట్‌గా తీసుకోవడంతో పెద్ద నేరాలు జరిగే ఆస్కారం ఉంటుందని సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**తప్పులు చేస్తే సమర్థించడం కరెక్టా.?**
తెలిసి తప్పులు చేసినా..తెలియకుండా నేరాలకు పాల్పడినా చర్యలు ఉండాల్సిందే. చట్టం ముందు అందరు సమానమనే వ్యాఖ్యలు పోలీసులకు వర్తించవనే విధంగానే నగరంలో కనిపిస్తున్నాయి. చోటా,మోటా బడానేతలంతా పైరవీలతో రూ. లక్షలు, కోట్లు సంపాదిస్తూ అక్రమార్కులు, నేరస్తులను తప్పించడంతో పరోక్షంగా పెద్ద నేరాలకు ఆజ్యం పోస్తున్నట్లే అర్థమవుతుంది. తప్పులు చేస్తే మరోసారి చేయకుండా కఠినంగా వ్యవహరించాల్సిన పోలీసులు నేరస్తులను వెనుకేసుకొని రావడంతో న్యాయం కోసం వచ్చే బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేవలం సామాన్యులకే సమస్యలు, కేసులు, శిక్షలు అనేవిధంగా పోలీస్‌స్టేషన్లు మారాయని బాధితులు ఆరోపిస్తున్నారు. అన్యాయం జరిగిందనే ఫిర్యాదు చేస్తే రోజుల తరబడి స్టేషన్ల చుట్టు తిరిగాల్సిన దుస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైన పలుకబడి ఉన్న వారుంటేనే కానీ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కావనే వాదనలు ఉన్నాయి. ఒక నిందితుడిపై పలు ఫిర్యాదులు చేసిన కనీసం దర్యాప్తు చేయకుండా కూడా వదిలేస్తున్నారు. అదేవిధంగా ఎం తప్పు చేయని వారిపైన కేసులు నమోదు చేసి సమగ్రదర్యాప్తు, విచారణలు జరపకుండా కోర్టుల ముందు దోషిగా నిలబడుతున్నారని పలువురు చెబుతున్నారు. సౌత్ జోన్‌లోని ఒక పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఇరువర్గాల దాడిలో రాజీ ఘటన జరిగిందనే తెలుస్తోంది.

**శిక్షలతోనే నేరాలు తగ్గుముఖం...**
ఏమైన సమస్యలు, అక్రమాలపై ఫిర్యాదులొస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయడం పోలీస్ రికార్డులో తొలి ప్రాముఖ్యత. నేరస్తుల గురించి తెలుసుకునేందుకు చాలా ఉపయోగపడుతుందని సామాజిక నిపుణులు గతంలో కేసుల నమోదు, అక్రమాలు, నేరాల విషయాలు బహిర్గతమవుతాయని వివరిస్తున్నారు. అలాంటివి ఏం చేయ కుండా పైరవీలతో తప్పిస్తే మరెన్నో దారుణాలకు ఒడిగట్టే అవకాశం లేకపోలేదని పేర్కొంటున్నారు. అందుకు పరోక్షంగా పోలీసులే కారణమని అనక తప్పదు. చిన్న ఘటనలపైన నమోదైన కేసుల్లో కూడా భయం ఉండేలా చర్యలు ఉండాలనే అభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పోలీస్ స్టేషన్లను ఉన్నతాస్థాయి అధికారులు ఫిర్యాదులు, కేసులు, శిక్షలపై ఆరా తీయాలని, ఏమైన అను మానాలు ఉంటే సంబంధిత ఇన్వెస్ట్‌గేషన్ అధికా రులతో చర్చించడంతో కేసుల పరిణామాలు తెలు స్తాయని అంటున్నారు. డబ్బుల మోసాలు, గొడు వలు, బెదిరింపులు, హత్య ప్రయత్నాలతో నలిగి పోతున్న బాధితులకు పోలీసులు అండగా నిలబడి న్యాయం చేకూరేలా మెరుగైన సేవలందింస్తే నమ్మకం ఏర్పడుతుంది. అంతేకాకుండా చిన్నపాటి నేరస్తులపై ఉన్న అభియోగాలతో చర్యలు చేపడితే మరోతప్పు చేయకుండా ఉంటారని అభిప్రాయపడుతున్నారు.

## సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై శ్రీవారి ఊరేగింపు

**సైఫాబాద్, జూన్ 4 ప్రభాతవార్త:**
హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 20వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి ఉదయం 5 గంటలకు సుప్రభాతం సేవతోపాటు రాత్రి చంద్రవాహనంపై ఊరేగింపు వరకు అన్ని సేవలు ఘనంగా వైభవంగా కన్నుల పండువలాగా జరిగాయి. శ్రీవారికి అన్ని సేవలతోపాటు బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు కొనసాగింది. పదిన్నర గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సహస్రదీపాలకరణ, రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు అంగరంగ వైభవం జరిగింది. ఊరేగింపులో పాల్గొన్న భక్తుల గోవిందనామాస్మరణలు మారుమ్రోగాయి, కళాకారుల సన్నాయి రాగాలు, మేళ తాళాలు, భజనలు, మహిళల నృత్యాలు, కోలాటం ప్రదర్శన అద్భుతంగా జరిగింది. పురవీధులన్ని అధ్యాత్మికతో నిండిపోయాయి. దేవాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా భక్తులకు తీర్థప్రాదాలతోపాటు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కూడా వేలాది మంది



పురవీధుల్లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు

భక్తులు పాల్గొన్నారు. భక్తులకు దోనర్ త్రినాథ్‌బాబు, టిటిడి ఎఇవో యు. రమేష్, దోనర్ త్రినాథ్‌బాబు, టిటిడి ప్రతినిధులు శ్రీనివాస్‌ప్రభు, శ్రీనివాస మణికంఠ, నిరజా, లక్ష్మీపతి, టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రాజెక్టు ఆఫీసర్ విజయలక్ష్మి, ప్రతినిధి హరినాథ్, శ్రీవారి సేవకులు, ఉద్యోగులు, సిబ్బంది, పోలీసులు విశేషమైన సేవలు అందించారు.



మాట్లాడుతున్న తూంకుంట నర్సా రెడ్డి

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**-జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి**

**గజ్వేల్, జూన్ 4 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సి పాలిటీ పరిధిలోని 1వ వార్డులో గల పోచమ్మ దేవాలయం అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నుండి రూ.45 లక్షలు మంజూరు కాగా బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సా రెడ్డి ఆలయంలో కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పక్క దారి పట్టించి ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేశారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వారి ఆర్థిక బలోపేతం కోసం కేటాయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, రాజు, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, వార్డు నాయకులు దయ్యాల యాదగిరి, సుఖేందర్‌రెడ్డి, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మైనార్టీ మాజీ అధ్యక్షుడు సమీర్, జంగం రమేష్‌గౌడ్, కొనమైన కన్నాయాదవ్, నక్క రేగొండ, గుంటుకు బిక్షపతి, సుభాష్‌చంద్రబోస్, లక్ష్మారెడ్డి, కప్పు భాస్కర్, జహీర్, మన్నె అరుణ్‌కుమార్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజార్, ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు శివులు, గుండు లక్ష్మణ్, రాంచంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

## మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు

**-ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి**



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి

**గజ్వేల్ టౌన్, జూన్ 4 (ప్రభాతవార్త):** మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలకు, వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని అన్నారు. ప్రమాదం చిన్నదైనా పెద్దదైనా దాని పర్యవసానం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. ఒక్క రోడ్డు ప్రమాదం కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా కృంగదీస్తుందని, ఇంటి యజమానికి జరగరానిది ఏదైనా జరిగితే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే అవకాశం ఉంటుందన్నారు. నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకుంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్, హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవుడి దయతో గ్రామం సుభిక్షితంగా ఉండాలి

**బిఆర్ఎస్ జిల్లా నాయకుడు కంటారెడ్డి**



బీరప్ప స్వామిని మొక్కుకుంటున్న కంటారెడ్డి తిరుపతిరెడ్డి

**పాపన్నపేట, జూన్ 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఆరేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప గుడి వద్ద, నిర్వహిస్తున్న బీరప్ప కళ్యాణ మహోత్సవంలో మెదక్ జిల్లా బిఆర్ఎస్ నాయకులు కంటారెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతర నిర్వహణ కోసం రూ. 20 వేల ఆయన బహూకరించారు. అలాగే పాడి పంటలతో ఆరేపల్లి గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆ బీరప్ప దేవున్ని కోరుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయన వెంట పాపన్నపెట మండల సర్పంచ్ల ఫోరం తాజా మాజీ అధ్యక్షులు కుమ్మరి జగన్, ఆరేపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ దావుల్ల శ్రీనాథరావు, మాజీ ఎంపీటీసీ జ్యోతి సాయిలు, ఏడుపాయల మాజీ డైరెక్టర్ కాశముల శ్రీనివాసరావు కుర్తివాడ సర్పంచ్ స్రవంతి శ్రీనివాస్ కసిరెడ్డి మాణిక్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి : ఎమ్మెల్యే

**పెద్దశంకరంపేట, జూన్ 4, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న చంద్రప్రకాష్ పదవి విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పదని. ఉద్యోగ నిర్వహణలో ఆయన చేసిన సేవలు పేరు ప్రఖ్యాతులను తీసుకువస్తాయని అన్నారు. అనంతరం జిల్లా విద్యాధికారి రాధా కిషన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుని పాత్ర చిరస్మరణీయంగా నిలిచిపోతుం దని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ వృత్తి కష్టతరంతో కూడుకున్నదన్నారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందిన చంద్ర ప్రకాష్ దంపతులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితోపాటు ఆయా ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పూలమా లలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్. ఎంఈఓ వెంకటేశం. ఆయా ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు శ్రీనివాస్ .రామచంద్రచారి, రామకృష్ణగౌడ్, మారుతి, ఎన్.శ్రీనివాస్, ఆనంద్ ప్రసన్నకుమార్, గోపి, సుజిత్ పాల్గొన్నారు.



పదవీ విరమన పొందిన ఉపాధ్యాయుడు చంద్రప్రకాష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

# రైతుల సంక్షేమం కోసమే భూభారతి చట్టం : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కేశంపేట జూన్ 4 ప్రభాతవార్త** రైతులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చామని అన్నారు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. బుధవారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో రెవెన్యూ సదస్సును, లేమామిడి, మరియు తురకలపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం లేమామిడి గ్రామంలోని రైతు వేదికలో గ్రామస్తులు ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సరిదిద్దడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం అని ఎమ్మెల్యే శంకర్ వెల్లడించారు. ఈ భూభారతి చట్టం ద్వారా రైతులందరికీ మేలు జరుగుతుం దని ఆయన అన్నారు. భూభారతి సదస్సుకు, మరియు ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన పలు విషయాలను ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో పలు విషయాలపై చర్చించారు. అనంతరం కేశంపేట తహసీల్దార్ ఆజం అలీ మాట్లాడుతూ బుధవారం ఇప్పలపల్లి లో 5, లేమామిడిలో 5 మొత్తం 10 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఆజం అలీ, ఇన్చార్జి ఎంపీడీవో కిష్టయ్య, షాద్ నగర్ వ్యవసాయం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కేశంపేట తాజా మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మార్కెట్ డైరెక్టర్లు కరుణాకర్, చేదురువల్లి భాస్కర్ గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గిరియాదవ్, కరుణాకర్‌రెడ్డి, ఏ.శ్రీనివాస్ గౌడ్, ఏ.ప్రకాశ్‌గౌడ్, రావులపెంటయ్యముదిరాజ్, జూలపల్లి అనసూయ ముదిరాజ్, అమేర్,రమేష్,లక్ష్మయ్య, బాలాజీ, ఆంజనేయులు, సుదర్శన్, కోరుడు రాములు, తైద పర్వతాలు, తాళ్ల నరసింహులుగౌడ్, అంజయ్య, సమీర్, గోపాల్, పాండు,సరికొండ రమేష్, అఖిల్,రాఘవేందర్,అజహర్ ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



లేమామిడి రైతు వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## కల్వకుర్తి నుంచి తలకొండపల్లి బస్సును పునరుద్ధరింపచేయాలని ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి

**-ఎమ్మెల్యే డిపో మేనేజర్ కు ఫోను**

**- స్పందించి వెంటనే రూట్ మ్యాప్ ఖరారు**

**తలకొండపల్లి జూన్ 4, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలానికి గతంలో నడుస్తున్న ఆర్టీసీ బస్సును నిలిపివేయడంతో అదే రూట్లో మళ్ళీ ఆర్టీసీ బస్సును పునరుద్ధరింప చేయాలని కోరుతూ బుధవారం నాడు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి గట్టు ఇప్పల పల్లి గ్రామస్తులు వినతిపత్రం అందించారు. గత ఎన్నో సంవత్సరాలుగా కల్వకుర్తి నుంచి మార్చల మీదుగా జిల్లెల్ల ,జకినాలపల్లి, గట్టిపల్లపల్లి, మెదక్ పల్లి, రాంపూర్ , చంద్ర ధన, తలకొండపల్లి వరకు ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళలో ఆర్టీసీ బస్సు నడిచేదని గత కొన్ని సంవత్సరాలుగా ఈ బస్సును అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రతిరోజు తలకొండపల్లి మండల కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, రవాణా సౌకర్యం లేక నిరుపేద ప్రజలు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి బస్సు గురించి వివరించగా వెంటనే కల్వకుర్తి డిపో మేనేజర్ సుభాషినికి ఫోన్ చేసి మాట్లాడారు. గతంలో కల్వకుర్తి నుంచి తలకొండపల్లి వరకు వెళ్లే ఆర్టీసీ బస్సును వెంటనే పునరుద్ధరింప చేయాలని తెలిపారు. స్పందించిన డిపో మేనేజర్ సుభాషిని హుటాహుటిన కల్వకుర్తి , జకినాలపల్లి ,గట్టు ఇప్పల పల్లి మీదుగా తలకొండపల్లి వెళ్లే రోడ్డు మార్గాన్ని రోడ్డు మ్యాప్ ను పరిశీలించారు.



గట్టు ఇప్పులవల్లి గ్రామంలో రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న కల్వకుర్తి డిపో మేనేజర్‌కు మినపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఈ సందర్భంగా డిపో మేనేజర్ సుభాషిని గ్రామస్తులతో మాట్లాడుతూ కల్వకుర్తి నుంచి యధావిధిగా తలకొండపల్లి వరకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె రేణు రెడ్డి, నాయకులు అంజయ్య, శివ కుమార్, నరేందర్ గౌడ్, మల్లేష్, శ్రీనివాసులు, రాములు, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో ధూల్‌పేట యువకుల హల్‌చల్

**-బైపాస్ అడ్డాగా పశు రవాణాపై పహారా**

**-అనుమతి ఉన్న పశువుల వాహనాన్ని అడ్డుకున్న బృందం**

**-వాహన డ్రైవర్, తదితరులపై దాడికి యత్నం**

**-గోశాలకు పశువుల తరలింపు**

**షాద్‌నగర్ జూన్4,ప్రభాతవార్త, :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై కొందరు ఇతర ప్రాంతానికి చెందిన యువకులు మకాం వేశారు. రాబోయే బక్రీద్ పండగను పురస్కరించుకొని పశు రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో అక్రమ పశు రవాణాపై ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా గోవులను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే పోలీసు అధికారులు ప్రకటించారు. అయితే షాద్‌నగర్‌లో భిన్నంగా కొంత మంది యువకులు ధూల్‌పేట నుండి బృందంగా ఏర్పడి స్థానిక చటాన్‌పల్లి జాతీయ రహదారి వద్ద మకాం చేశారు. వచ్చిపోయే వాహనాలను పహారా కాస్తూ వారే స్వయంగా తనిఖీ చేస్తున్నారు. పశువులు కనిపించిన ఇతర ధృవపత్రాలు వారి వద్ద రవాణా అనుమతి ఉన్నప్పటికీ వారితో ఘర్షణలకు దిగుతూ చేయి చేసుకుంటున్నారు. షాద్‌నగర్ వద్ద నవాజ్, హబీబ్ అనే యువకులను వాహనం నుండి కొందకు దింపి దాడి చేసే ప్రయత్నం చేశారు. వారి చేతుల్లో ఉన్న సెల్‌ఫోన్లు లాక్కున్నారు. రోడ్డుపైకి వచ్చిన పోయే వాహనాలను ఆపుతూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. వారి చేతుల్లో రాడ్లు, కర్రలు ప్రదర్శిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఇప్పటికే పోలీసులు హైవేపై రోడ్లపై చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచారు. అక్రమ పశు రవాణాను వారు అడ్డుకునేందుకు అన్ని విధాల చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. చట్టపరంగా వారు చర్యకు ఉపక్రమిస్తున్నారు. అయితే హైదరాబాద్



షాద్‌నగర్ బైపాస్ రహదారిలో కాపుకాచిన హైదరాబాద్ యువకులు

ధూల్‌పేట నుండి పశు రవాణాను అడ్డుకునే ముసుగులో యువత కొందరు చట్టాన్ని వారి చేతుల్లోకి తీసుకొనే విధంగా ముందుకు వచ్చారు. బుధవారం బైపాస్ రహదారిపై అన్ని అనుమతులతో దున్నపోతులు, ఎడ్లను మహబూబ్‌నగర్ ప్రాంతం నుండి హైదరాబాద్ జహనుమకు తీసుకువెళ్తున్న వాహనాన్ని (టీజీ06టీ1777)ను అటకాయించారు. సదరు వాహన డ్రైవర్ హబీబ్బుఖ దాడి చేసే ప్రయత్నం చేశారు. అయితే బాధితుడు వెంటనే 100కు ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఐదు దున్నపోతులను, మూడు ఎడ్లను గోశాలకు తరలించారు. అయితే ఈ రవాణాకు అనుమతి ఉండడంతో మహబూబ్‌నగర్ నుండి రాజధాని వెళ్తున్నాయి. పశుసంవర్ధక శాఖ ధృవపత్రంతో పాటు రవాణా అనుమతి కూడా వీటికి ఉంది. అయినప్పటికీ ఈ బృందం అడ్డుకొని వారిపై దాడి చేయడం గమనార్హం. పోలీసులు కూడా వాటిని ఓవర్ లోడ్ పేరిట గోశాలకు తరలించడం గమనార్హం. సదరు యువకులు వాహన డ్రైవర్ల వద్ద లాక్కున్న సెల్‌ఫోన్లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అయితే ఇప్పుడు ఇప్పుడు ఓవర్‌లోడ్ అంటూ సదరు యువకులను పోలీసులు వారి అదుపులోనే ఉంచుకున్నారు.

**చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు**

**- ఎసిపి లక్ష్మీనారాయణ**

అక్రమ పశు రవాణాపై తమ దృష్టికి వస్తే చట్ట ప్రకారం తామే చర్యలు చేపడతామని షాద్‌నగర్ ఏసీపీ ఎస్.లక్ష్మీనారాయణ వెల్లడించారు. చటాన్‌పల్లి బైపాస్ జాతీయ రహదారి వద్ద పశువుల రవాణా వాహన విషయాన్ని మీడియా ఏసీబీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి మాట్లాడారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎవరైనా సరే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం వివరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇతర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి వాహనాలు పట్టుకునే అధికారం ఎవరికీ లేదని ఏసీపీ స్పష్టం చేశారు. అలాంటివి తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

**కొందుర్గు (జూన్4), ప్రభాతవార్త, :** అందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, అందుకు గాను ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశా లలోనే చేర్పించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప పిలుపునిచ్చారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మండల పరిధిలోని అయోధ్యపూర్ తండా, కొందుర్గులో బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారి బాలబాలికలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్, చౌదరిగూడ మండల ప్రధాన కార్యదర్శి ప్రకాష్, పిడబ్ల్యుఎఫ్ కన్వీనర్ శ్రీరాములు, కార్యదర్శి సంజీవతో పాటు సంఘం సీనియర్ నాయకులు నర్సింలు, విజయ్ గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొందుర్గులో బడిబాట నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్

## గంజాయి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు

**-ఇంచార్జ్ సిఐ శ్రీనివాస్**



ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితుడు

**పెద్దేముల్, జూన్ 4, ప్రభాతవార్త:** గంజాయి కలిగియుండుట, సేవించుట, ఇతరులకు విక్రయించిన కఠిన చర్యలు తప్పవని తాండూరు ఇంచార్జ్ సిఐ శ్రీనివాస్‌హెచ్చరించారు. ఎస్‌హెచ్ఓ తాండూరు టీమ్, డిటిఎఫ్ వికారాబాద్ టీమ్ ఎక్సైజ్ పోలీసులు పెద్దేముల్ మండలం తట్టెపల్లి గ్రామంలోని మహ్మద్‌మియ్యా గంజాయి కొనితెచ్చి సేవిస్తున్నాడనే సమాచారంతో మంగళవారం సాయంత్రం అతని ఇంటి పరిసరా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించగా అక్కడ 125 గ్రాములఎందు గంజాయి లభించింది. గంజాయి కలిగియున్న, సేవించిన, అమ్మిన నిషేదం కావున మహ్మద్‌మియ్యాపై ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసిరిమాండ్ తరలించినట్లు సిఐ తెలిపారు. ప్రభుత్వ నిషేదిత గంజాయిని విక్రయించిన, కొనుగోలు చేసిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇట్టి దాడులలోఎస్‌ఐలు ఆదిశేషరెడ్డి, నిజాముద్దిన్,సిబ్బంది భీమయ్య, రవి కిషోర్, రవి కిరన్, కుమార్, విష్ణు, శివప్రసాద్, హనుమంతు, ఆసిఫాభేగం, రాధిక, మహేందర్, సతీష్ పాల్గొన్నారు.

## పంటల్లో సేంద్రియ ఎరువులనే వాడుకోవాలి

**నర్సాపూర్ జూన్ 4 ప్రభాతవార్త :** రైతులు పంటల్లో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులనే వాడుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలో మండల పరిధిలోని ఇబ్రహీంబాద్ గ్రామంలో ని రైతు వేదికల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతలకు అవగాహన అనే కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం, యూరియా వాడకం, మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలపై సేంద్రియ ఎరువుల వాడకంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అదేవిధంగా వరి పత్తి వివిధ పంటల్లో తీసుకోవలసిన మెలకువలను సస్యరక్షణ చర్యలను పురుగుల మందు వాడకాన్ని పంటల మార్పిడి పద్ధతి పై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు పంటలపై ఉన్న సందేహాలను శాస్త్రవేత్తలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి దీపిక మాట్లాడుతూ రైతుల ముంగిట్లోనే శాస్త్రవేత్తలు వచ్చి విత్తన కొనుగోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పచ్చి రొట్టె ఎరువుల వాడకం పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు రైతులు వేసే శాస్త్రవేత్తలు సూచించిన విధంగా పంటలను సాగు చేసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ గీత డాక్టర్ రంజిత, డాక్టర్ గాయత్రి, మండల వైశాధికారిణి దీపిక, వ్యవసాయ విస్తరణ అధికారులు చంద్రవేణి, తేజస్విని, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బస్సులు నడిపించాలని కాంగ్రెస్ నాయకుల వినతి

**మేడ్చల్, జూన్ 4. ప్రభాతవార్త :** మేడ్చల్ రాయిలాపూర్ బస్సులను పున: రుద్ధరించాలని కోరుతూ మేడ్చల్ బస్ డిపో అసిస్టెంట్ మేనేజర్ రామారావుకు మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి వినతి పత్రం అందజమేడ్చల్ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కారణంగా బస్సు సౌకర్యం నిలిపివేయడంతో గిర్మాపూర్, శ్రీరంగవరం, రాయిలాపూర్, బండ మాదారం, పరిసర గ్రామాల ప్రజలతో పాటు పాలిటెక్నిక్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వినతిలో పేర్కొన్నాడు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయినందున నిలిపివేసిన బస్సులను యదావిదిగా నడుపాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రమణారెడ్డి, నాయకులు సుదర్శన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, చంద్రయ్య గౌడ్, టైలర్ రాజు పాల్గొన్నారు.



డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినత పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ఇందిరమ్మ కళ ప్రతి పేదవాడికి పక్కాఇళ్ళు

**-చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పామేన భీమ్‌భరత్**



**మొయినాబాద్, జూన్ 4, ప్రభాతవార్త :** మొయినాబా మండలం అజీజ్‌నగర్ గ్రామంలో తెలంగాన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ది దారులకు చేవెళ్ల నియోజకవర్గం కాఇంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, పామేన భీమ్‌భరత్ లబ్ధిదారులకు నియామక పత్రాలు అందజేసి, వారి ఇంటిని ప్రారంభించారు, ఈ స్కీమ్ ద్వార అర్హులైన పేదలందరికి సొంత ఇల్లు కట్టుకునేందుకు రూ 5లక్షలు ఆర్థిక సంవత్సరానికి గాను, ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇండ్లను కేటాయించింది కాగా మెదటి విడతలో సొంత ఇంటి స్థలం కలిగినవారికి ఇండ్లను కేటాయిస్తుంది ప్రజా ప్రభుత్వం అన్నారు, వచ్చే విడత నుంచి ఇంటి స్థలం లేని వారికి ప్లాట్ మంజూరు చేసి 5లక్షలతో ఇండ్లు నిర్మించనుందని తెలిపారు, ఈ కార్యాక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండల అధ్యక్షులు మానయ్య, వైస్ ప్రసిడెంట్ రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షులు కొత్త జైపాల్ రెడ్డి, కుమ్మరి వెంకటేష్, మాజి సర్పంచ్‌లు సత్యనారాయణ, వీరభద్ర స్వామి, మాడి వెంకట్ రెడ్డి, కరణ్ కుమార్, కేబుల్‌రాజు, ఇందిరమ్మ కమిటి మెంబర్ బాలకృష్ణరెడ్డి, జైపాల్‌రెడ్డి, విలేజ్ కమిటి అద్యక్షులు మహేందర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, నర్సింగ్ రావు, నాగరాజు, భిక్షపతి, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, నాగిరెడ్డి గూడ, గ్రామ కమిటి అధ్యక్షులు విజయరాజ్, కనగల రాజుయూత్ కాంగ్రెస్ నరేందర్, జైపాల్‌రెడ్డి, ఎంపీటీసి గణేష్‌గౌడ్, ఆయా గ్రామాల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటి సభ్యులు, పాల్గొన్నారు,

## ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**రాజేంద్రనగర్ ఆర్డిఓ వెంకట్ రెడ్డి**



**శంషాబాద్. జూన్ 4. ప్రభాతవార్త :** రైతుల సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ ఆర్డిఓ కె వెంకటరెడ్డి సూచించారు. శంషాబాద్ మండలంలోని నరుకుడా శంకరాపురం గ్రామాల్లో శంషాబాద్ తహసిల్దార్ రవీందర్ దత్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని దీని ద్వారా రెవెన్యూ సమస్యలు పూర్తిగా పరిష్కరించాలన్నది ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రెవిన్యూ సదస్సులో వచ్చే ఆర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ అధికారులకు ఆయన సూచించారు. రెవిన్యూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని వెంకటరెడ్డి అన్నారు. రెవిన్యూ అధికారులు గ్రామాలకు వచ్చి సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని వీటిని అందరూ వినియోగించుకోవాలని తహసిల్దార్ రవీందర్ దట్ కోరారు. జిల్లా కలెక్టర్ ఆర్డిఓ ఆదేశాల మేరకు సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సారిక రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే భూ సమస్యల పరిష్కారం



రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్న టిపిసిసి ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్

**శామీర్‌పేట్, జూన్4, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీతోనూ భూ భారతి సమస్యలను పరిష్కరించడానికే భూ భారతి పథకాన్ని తీసుకువచ్చిందని టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పోతారం, కేశ్వాపూర్, యాకత్‌పుర, శామీర్‌పేట్ మండలం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని మందాయి, అంతాయిపల్లి వార్డులలో రెవెన్యూ సదస్సులకు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుటకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహ్మా యాదవ్, తహశీల్దార్ వెంకట నర్సింహ్మారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జగన్నాదం, బస్వారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అఖిలేష్‌రెడ్డి, శామీర్‌పేట్ తహశీల్దార్ యాదగిరిరెడ్డి, డిప్యూటి తహశీల్దార్ అనుష, ఆర్ఐలు కవిత, , అనేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతితో భూ సమస్యలు పరిష్కారం : తహశీల్దార్ శ్రీనివాస్



ఇందోల్ గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాస్

**కోట్‌పల్లి, జూన్ 4, ప్రభాతవార్త;** భూ భారతితో భూ సమస్యలు పరిస్కరించుకోవడం జరుగుతుందని తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని ఇందోల్, ఒగ్లాపూర్ గ్రామాలల్లో భూ సమస్యలపై భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. గతంలో రికార్డులలో పేర్లు తప్పుగా పడ్డా ఏవైనా భూ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులు రైతులు దరఖాస్తులు చేసుకుంటే అక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇందోల్ గ్రామంలో 11, దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. ఒగ్లాపూర్ గ్రామంలో ఎలాంటి దరఖాస్తులు రాలేదన్నారు. గురువారం 5, తేది నాడు కోత్తపల్లి, రాంపూర్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో 6, నాడు కోట్‌పల్లి, పంచాయతీ కార్యాలయంలో 9, నాడు కంకణాలపల్లి, పంచాయతీ కార్యాలయంలో 10, నాడు మల్‌చేట్ పల్లి అంగాన్‌వాడీ సెంటర్‌లో 11, నాడు జిన్నారం, పంచాయతీ కార్యాలయంలో 12, నాడు బార్వాద్ పంచాయతీ కార్యాలయంలో 13, నాడు మోత్కుపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో 16, నాడు ఎన్కెపల్లి, పంచాయతీ కార్యాలయంలో17, నాడు నాగసాన్‌పల్లి, పంచాయతీ కార్యాలయంలో 18, నాడు బీరోల్, పంచాయతీ కార్యాలయంలో 19, నాడు కరీంపూర్ పంచాయతీ కార్యాలయంలో 20, నాడు ఎన్నారం, పంచాయతీ కార్యాలయంలో ఉదయం, 10, గంటల నుంచి సాయంత్రం 4, గంటల వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు రెవెన్యూ సదస్సులకు సమస్యలు ఉంటే దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ యూనుస్, ఆర్ఐ బాగ్యలక్ష్మి, సిబ్బంది జగ్గదీష్, సంగయ్య, బాల్‌రాజ్, సతీష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు,



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు : ఎమ్మెల్యే

**కంగ్టి, జూన్ 4, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాంతీర్థ్, ఎన్కెమురి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బసు, గృహిణులకు రూ. 500 గ్యాస్, 200 యూనిట్ల విద్యుత్ సరఫరా పథకాలు అమలుచేస్తోందని చెప్పారు.

**సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ...**

అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన వారు కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందుకునేందుకు బుధవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈఈ దామ నాగన్న, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు మాధవ్‌రావు పాటిల్, గణేష్, సంజీవరెడ్డి, కాశీనాథ్ పాటిల్, శరణప్ప, జగదీష్‌పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, బాబుపాటిల్, వెంకట్‌రెడ్డి, అర్జున్,పవన్, రాజు పాటిల్,అంజప్ప, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల శ్రేయస్తే కాంగ్రెస్ ధ్యేయం : పుట్ట నర్సింగరావు



రైతులకు పట్టాలు అందిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల జూన్ 4 (ప్రభాతవార్త) :** మండల పరిధిలోని అనంతారం గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతు రెవెన్యూ సదస్సులో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, వీరభద్రస్వామి ఆలయ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల క్రితం నుండి రైతులకు ఎదురవుతున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సు విజయవంతంగా రైతుల సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. సదస్సుకు రైతులు హాజరై సమస్యను తహసీల్దార్‌కు వివరించి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశం, మద్ది వీరారెడ్డి, దయాకర్‌రెడ్డి, జింక గోపాల్, మహిపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, ఇంద్రసేనరెడ్డి, లక్ష్మణ్, రాంరెడ్డి, రామకృష్ణరెడ్డి, పాల్గొన్నారు.

## సొంతింటి కల నేరవేర్చడమే కాంగ్రెస్ లక్ష్యం : ఉజ్వల్‌రెడ్డి



మాడ్గిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజచేస్తున్న ఉజ్వల్‌రెడ్డి

**జహీరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్‌నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్ రెడ్డి అన్నారు. బుధవారం మొగుడంపల్లి మండలం మాడ్గి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉజ్వల్‌రెడ్డి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి లబ్దిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ముబీన్, మాజీ సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మొగుడంపల్లి మండల మాజీ కో-ఆప్షన్ సభ్యులు హర్షద్ పటేల్, ఎంపిడిఓ, ఆయా శాఖల అధికారులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## నేడు మహీంద్రా కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు




గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** ఈ నెల 5వ తేదీన పట్టణ శివారులోని మహీంద్రా ఆండ్ మహీంద్రా కర్మాగారంలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు కార్మికులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటారు. ఓటింగ్ అనంతరం ఎన్నికల కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల బరిలో ఐఎన్టీయూసి నిలుస్తోంది. ఎన్నికల్లో సిఐటియుసి తరపున సిపిఎం నాయకులు చుక్కా రాములు,ఐఎన్టీయూ తరఫున కార్మిక నాయకులు జానకి ప్రసాద్ బరిలో ఉన్నారు. ఐఎన్టీయుసి, సిఐటియు బాధ్యులు ఈ పాటికే కర్మాగారం ముందు గేట్ మీటింగ్‌లు నిర్వహించి ఎన్నికల్లో మద్దతు పలకాలని కార్మికులకు విన్నవించుకున్నారు. సిఐటియు తరపున సిపిఎం నాయకులు మల్లేశం, రామచందర్, మహిపాల్ తదితరులు ప్రచారం నిర్వహించగా రాష్ట్ర సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి జానకి ప్రసాద్ తరఫున ప్రచారం నిర్వహించారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**ఎఐటియుసి మండల కార్యదర్శి శంకరప్ప**

**సదాశివపేట, జూన్ 4, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్‌కోడ్‌లను వ్యతిరేకిస్తూ జూలై 9న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే దేశ వ్యాప్తం సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి మండల కార్యదర్శి శంకరప్ప అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతంచేయాలని కోరారు.

## పుస్తెలు, మెట్టెలు అందజేత

**చిన్నశంకరంపేట,జూన్ 4,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొర్విపల్లి గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన పోచయ్య కూతురు నవనీత వివాహం బుధవారం జరుగగా మైనంపల్లి స్వచ్ఛంద సంస్థ చైర్మన్, ఎమ్మెల్యే రోహిత్‌రావు పుస్తే మట్టెలను పంపగా కాంగ్రెస్ నాయకుడు రామచంద్రం వారికి అందించారు. కార్యక్రమంలో జనార్ధన్, మల్లేశం, నర్సింలు, రాములు పాల్గొన్నారు.

# నేటి నుంచి మెటల్‌కుంట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

**-విగ్రహాలు, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠాపన -హాజరుకానున్న ఎంపి,ఎమ్మెల్యే, ప్రముఖులు, మహర్షులు**



ఉత్సవాలకు ముస్తాబైన ఆంజనేయస్వామి ఆలయం

**న్యాల్‌కల్, జూన్ 4, ప్రభాతవార్త:** ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మండలంలోని మెటల్ కుంట గ్రామంలో పునర్ నిర్మించిన ఆలయంలో ఆంజనేయస్వామి స్వామి విగ్రహ ప్రతిష్టాపనతో పాటు నవగ్రహ, శివపంచాయాతన, నాగమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, భవానిమాత, భాగ్యవతి భాగ్యమ్మ విగ్రహాలు, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టాపనకు ఆలయ కమిటీ బాధ్యులు తగు ఏర్పాట్లు పూర్తి చేశారు. జూన్ 5న ఉదయం 6గంటల నుంచి విఘ్నేశ్వరుడి పూజ, గోవుపూజ, ధ్వజారోహణం, అఖండ దీపారాధన, పుణ్యాహవాచనం, మాతృక గౌరిపూజ, రుత్విక్ వర్ణము, మండపదేవత పూజ, అగ్నిప్రతిష్ట, విగ్రహాల ఊరేగింపు, ధన్యాదివాసం, జలాదివాసం, హవనము, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, 6న ఉదయం శాంతిపారం, అవాహిత దేవత, మండప దేవత పూజ మహాస్తవసము, చతుష్పాది బలి, నత్రోస్నీలనం, గ్రామ దేవతల ప్రతిష్టాపన, నైవేద్యం, హారతి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, 7న ఉదయం శాంతిపారం, ఆవాహిత దేవత, మంటప దేవత పూజ, దేవత ఉద్వావనం, గర్భ సంస్కారం యంత్ర ప్రతిష్ట, శివ పంచాయతన ప్రతిష్ట, నాగ దేవత, ధ్వజస్తంభ, నవగ్రహ, సీతల ప్రతిష్ట (బొడ్రాయి), బలి పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ట, తీర్థ ప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా బర్దిపూర్, బిచకుంద, ధనసిరి, తంగెడపల్లి జంగమయ్య గుట్ట, న్యామతాబాద్, ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమం, కొండాపూర్ ఆశ్రమం, దుద్యాల ఆశ్రమం, మల్గి ఆశ్రమ పీఠాధిపతులు రాచయ్యస్వామి రాజయోగి ఆశ్రమం, ముక్తాబాయి మాత ఆశ్రమాల పీఠాధిపతులు వైరాగ్యా శిఖామణి అవదూతగిరి మహారాజ్ (అప్ప గారు), సోమలింగ శివాచార్య స్వామి, వీరేశ్వర శివాచార్య స్వామి, మహంత్ సిద్దేశ్వర శివాచార్య స్వామి, శివయోగి శివాచార్య స్వామి, మహంత్ విశ్వానందగిరి మహారాజ్, దేవగిరి మహారాజ్, సంగ్రాం మహారాజ్, అంబిక శివయోగి స్వామి, సిద్దయ్య స్వామి, రాచయ్యస్వామి, ముక్తాబాయి మాత, జగదీశ్వరి మాతలు హాజరువతున్నట్లు పేర్కొన్నారు.

అలాగే ఆలయంల జరిగే పూజలకు జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ మంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్, రాష్ట్ర సెట్విన్‌చైర్మన్ గిరిధర్‌రెడ్డి తదితరులను ఆలయ కమిటి బాధ్యులు ఆహ్వానిం చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజలో పాల్గొనా లని ఆలయ కమిటీ బాధ్యులు కోరారు.




పూజితకు నగదు రివార్డు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

## టెన్త్‌లో ప్రతిభ చాటిన పూజితకు సత్కారం

**సిద్దిపేట అర్బన్(మిరుదొడ్డి), జూన్ 4, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన సాన పూజిత తెలంగాణ గురుకులపాఠశాల ఎన్సాన్‌పల్లిలో చదువుతూ ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాలలో 600 మార్కులకుగాను 566 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అధికారి రాఘవ, రిజర్వ్ బ్యాంకు ప్రతినిధులు సాన పూజితను పూలమాలు, శాలువాతో ఘనంగా సత్కారించి నగదు ప్రోత్సహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థికి సత్కారం



టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని సత్కారిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బర్(మిరుదొడ్డి), జూన్ 4, ప్రభాతవార్త :** మిరుదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ టెన్త్ ఫలితాల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన నంద్యాల శృతిని మిరుదొడ్డి టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కారించి ప్రోత్సాహకంగా రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు అందె రామచంద్రం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన గుణాత్మకమైన విద్యా అందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి నరేష్, మల్లేశం, కృష్ణ, సాయిలు,శ్రీకాంత్, శ్రీనివాస్, గౌస్, మహేష్, దశరథం,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

**అక్కన్నపేట, జూన్ 4, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన 20 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పొండ్రాల దాము ఆధ్వ ర్యంలో బుధవారం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారదర్శకంగా ఇళ్ల లేనివారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందుతున్నాయన్నారు. అక్కన్నపేట మండలాన్ని రాష్ట్రంలోనే భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న ఘనత మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కే దక్కుతుందన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు ధ్యేయమన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నిర్మల, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపిటిసి బైరగొని శ్రీనివాస్, మంద పరశురాం,కుంచం కనకయ్య, లబ్దిదారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న దృశ్యం



ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోస్తున్న గ్రంధాలయ చైర్మన్ లింగమూర్తి

## గూడు లేని ప్రతి పేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

**జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి**

**అక్కన్నపేట, జూన్ 4, ప్రభాతవార్త :** పదేళ్ల కాలంలో పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టివ్వని బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయమై మాట్లాడడం విచిత్రంగా ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కెడం లింగమూర్తి మండిపడ్డారు. అక్కన్నపేటలో బుధవారం లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మొదటి విడతలో 334 ఇండ్లు మంజూరు వచ్చినట్లు తెలిపారు. మరో నెల, రెండు నెలల్లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. 10 యేండ్ల తర్వాత కాంగ్రెస్ సర్కారు హయాంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు వస్తుండడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామాలలో నిర్మిస్తున్న ఇండ్లను మంత్రి ప్రభాకర్‌గౌడ్ త్వరలోనే పరిశీలిస్తారని తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## పద్మశాలీల అభ్యున్నతికి సహకరిస్తా

**బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్**



పద్మశాలి సమాజం నూతన కార్యవర్గాన్ని సత్కారిస్తున్న శంకర్‌ముదిరాజ్

**సిద్దిపేట అర్బన్, జూన్ 4, ప్రభాతవార్త:** పద్మశాలీల అభ్యున్నతికి సహాయ సహకారాలు అందిస్తానని బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్ అన్నారు. సిద్దిపేట మార్కండేయ దేవాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ పద్మశాలి సమాజం ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కాముని రాజేశం, ప్రధాన కార్యదర్శి సిరిగాది బాలరాజ్, కోశాధికారి సూరం ప్రసాద్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను సత్కారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని సమాజం అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. పద్మాశాలి సమాజం అభివృద్ధి కోసం మెదక్ ఎంపి రఘునందన్‌రావు సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు బాసంగారి వెంకట్, గుండ్ల జనార్ధన్, పద్మశాలి సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ మార్కండేయ దేవాలయంలో ప్రత్యేకనపూజలు నిర్వహించారు.

## భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి : తహసీల్దార్

**పాపన్నపేట, జూన్ 4, ప్రభాతవార్త :** భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సతీష్ అన్నారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూభారతి సదస్సులో భాగంగా రెండవ రోజు చికోడ్, ఎంకేపల్లి గ్రామాలలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను రైతుల నుండి స్వీకరించారు. సదస్సుల నిర్వహణ తీరును ఆయన పర్యవేక్షించారు.

## పెద్దశంకరపేట ఎస్ఐగా ప్రవీణ్ రెడ్డి

**పెద్దశంకరంపేట, జూన్ 4, ప్రభాతవార్త :** పెద్దశంకరంపేట ఎస్సైగా ప్రవీణ్‌రెడ్డి బుధవారం విధుల్లో చేరారు. అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌రెడ్డి బదిలీపై పెద్దశంకరంపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేసిన శంకర్ అల్లాదుర్గం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

# మూతపడిన పెట్రోల్ బంకులు

**-వ్యాపార సముదాయాల్లో కల్తీ పెట్రోల్..-వాహన చోదకులకు తప్పని తిప్పలు**




**కంగ్టి, జూన్ 4,ప్రభాతవార్త:** ఇంటి గడపదాటితే వాహనంపైనే ప్రయాణం చేస్తున్న రోజులు ఇవి. ప్రతి పేద ఇంట్లో ఒక ద్విచక్ర వాహనం, కారు, మోతుబారి రైతు కుటుంబంలో ట్రాక్టర్ ఉన్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో 5 వేలకు పైగా కుటుంబాల్లో 8 వేలకు పైగా వాహనాలు (ద్విచక్ర వాహనం, కారు, ట్రక్టర్) ఉన్నాయని అంచనా. వాహనాలు రోడ్డుపై రయ్ రయ్ మంటూ పరిగెత్తేందుకు మండల కేంద్రమైన కంగ్టిలో 3, మండలంలోని తడ్కల్‌లో 2 పెట్రోల్ బంక్‌లు వాహన చోదకులు పెట్రోల్, డీజిల్‌ను అందుకునేవారు. కంగ్టిలో మూడు పెట్రోల్ బంక్‌ల్లో ఒక బంక్, తడ్కల్‌లోని 2 పెట్రోల్‌బంక్‌లు(హెచ్‌పి పెట్రోల్, ఎస్సార్ బంక్) ఆరు నెలల క్రితం మూతపడ్డాయి. తడ్కల్‌లోని రెండు బంకులు మూతపడటంతో వాహనాల చోదకులు పెట్రోల్, డీజిల్ అందుబాటులో లేక పడరాని పాట్లు పడాల్సి వస్తోంది.

**వ్యాపార సముదాయాల్లో పెట్రోల్...**

తడ్కల్‌లో పెట్రోల్ బంక్‌లు 2 మూతపడటంతో వ్యాపార సముదాయాల్లో అక్రమంగా పెట్రోల్, డీజిల్‌ను అమ్ముతున్నారు. మండలానికి కర్ణాటక రాష్ట్ర దగ్గరకావడం, కర్నాటకలో తెలంగాణ రాష్ట్రంలో కన్నా పెట్రోల్, డీజిల్ ధర తక్కువ కావడంతో వ్యాపారులు కర్ణాటక నుంచి పెట్రోల్, డీజిల్ తెప్పించుకుని అధిక ధరలకు అక్రమంగా అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు. తడ్కల్ ప్రాంతం నుంచి కంగ్టి, పిట్లం వెళ్లాలన్నా, కర్ణాటకకు వెళ్లాలన్నా 15 కిలోమీటర్ల మేర దూరం కావడంతో చేసేది లేక కల్తీ పెట్రోల్‌ను అధిక ధర చెల్లించి (లీటరు వద్ద 20 రూపాయలు అధికం) బండిలో పోసుకోవాల్సిన దయనీయ దుస్థితి వాహన చోదకులకు దాపురించింది.

కల్తీ పెట్రోల్ వినియోగంతో తరుచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. మూతపడిన పెట్రోల్ బంక్‌లు తెరుచుకునేలా లేదా కొత్త పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు మంజూరైనా చేయాలని మండల ప్రజలు వినతి చేస్తున్నారు.

## రుక్మాపూర్‌లో రెవెన్యూ సదస్సు

**న్యాల్‌కల్, జూన్ 4, ప్రభాతవార్త:** భూ భారతి చట్టంతో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవతాయని ఆర్‌డిఓ రామ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రుక్మాపూర్‌లో భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై ఆర్‌డిఓ రామ్ రెడ్డి మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించి ఆధారాలతో ధరఖాస్తులు చేసుకోవాలని, ధరఖాస్తులను పరిశీలించి పరిష్కరించడం జరగుతుందన్నారు. రైతులు రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని లబ్దిపొందాలని డివిజన్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జి తహసిల్దార్ రాజిరెడ్డి, రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**సదాశివపేట మండలంలో...**

**సదాశివపేట, జూన్ 4, ప్రభాతవార్త:** భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అంకేనపల్లి, ఎల్లారం గ్రామాల్లో రెవెన్య సదస్సులు నిర్వహించారు. అంకేపల్లి రెవెన్యూ సదస్సులో ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి పాల్గొని రైతుల నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ జూన్ 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు అందచేసిన ధరఖాస్తులను ఏ రోజువి ఆరోజే స్థితిగతులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు కార్యక్రమంలో ఉప తహసీల్దార్ బాలరాజు, అంతయ్య, యాదగిరి పంచాయితీ కార్యదర్శి జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

**ఎల్లారంలో...**

మండలపరిధిలోని ఎల్లారం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతులు అందచేసిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు కొత్త పెన్షన్‌లకు ధరఖాస్తులను స్వీకరించారు. గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి బిల్లులు అందాయా లేదా అని లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి ఎంపిడిఓ లక్ష్మీ, పంచాయితీ ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు, ఆర్ గంగాధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సిద్దన్న, పంచాయితీ కార్యదర్శి ప్రణయ, ఇందిరమ్మ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

**మైకోడ్ గ్రామంలో...**

**మనూర్, జూన్ 4, ప్రభాతవార్త:** భూ భారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని మైకోడ్ గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో పాల్గొని రైతులు అందచేసిన ధరఖాస్తులను తహసీల్దార్ స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిత మాట్లాడుతూ భూభారతితో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఖాజా మైనోద్దిన్, గోపాల్, జైపాల్, విఠల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**చిద్రుప్పలో...**

**కంది, జూన్ 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిద్రుప్ప గ్రామంలో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతులు అందచేసిన ధరఖాస్తులను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. భూ భారతితో భూసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రఘుగౌడ్, టిపిసిసి కార్యదర్శి చేర్యాల ఆంజనేయులు, నాయకులు శ్రీశైలం, మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి,రాంసింగ్ నాయక్, బి ప్రసాద్, మురారి, రైతులు పాల్గొన్నారు.

**సిద్దిపేటలో...**

**సిద్దిపేట అర్బన్(మిరుదొడ్డి),జూన్ 4, ప్రభాతవార్త :** భూసమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం ప్రభుత్వం తీసుకొచ్చిందని మిరుదొడ్డి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. అపరిష్కృత భూ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకొని పరిష్కరించుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులో 100 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ సందీప్, ఆర్ఐ విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ కొండల్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ

**కంగ్టి, జూన్ 4, ప్రభాతవార్త:** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను(కంది, పెసర, సన్నరకం వరి) అధికారులు అందచేశారు. మండల పరిధిలోని తడ్కల్‌లోని రైతువేదికలో ప్రతి రెవెన్యూ గ్రామం నుంచి ముగ్గురిని ఎంపిక చేసి నాణ్యమైన విత్తనాలను అందచేశామని మండల వ్యవసాయ అధికారి హరీష్‌పవార్ పేర్కొన్నారు. విత్తనాలు అందుకున్న రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటలను సాగు చేసి తిరిగి ఆ విత్తనాలను గ్రామరైతులకు అందించాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన రైతులకు నామమాత్రపు డబ్బులతో(10 కిలోల బస్తాకు రూ.50 సన్న గింజ వరి (కెఎన్ఎం-1638రకం)ను 27 మంది రైతులకు, కంది (డబ్ల్యుఆర్‌ఈ-97రకం) విత్తనాలను 35 మంది రైతులకు, పెసర (ఎంజిజి-295 రకం)ను 45 మంది రైతులకు నాణ్యమైన విత్తనాలను అందచేసినట్లు మండల వ్యవసాయ అధికారి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ హరి, ఏఈఓలు హన్మాండ్లు, సంతోష్, భార్గవ్, నాగేందర్, షరీఫ్, గీత, రైతులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**న్యాల్‌కల్, జూన్ 4, ప్రభాతవార్త:** రైతులు అధిక మోతాదులో ఎరువులు, పురుగుల మందుల వినియోగిస్తుండటంతో భూసారం దెబ్బతింటోందని, ఫలితంగా పంటల దిగుబడి ఆశించిన మేర రావడం లేదని, ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని బసంత్‌పూర్ గ్రామ శివారులోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాయం శాస్త్రవేత్త తబసుమ్ ఫాతిమా, వ్యవసాయశాస్త్రవేత్త హరికుమార్ అన్నారు. బుధవారం హద్నూర్ గ్రామంలోని రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఫాతిమా తబసుమ్ మాట్లాడుతూ ఎరువులను తక్కువగా వినియోగిస్తే ఖర్చులు తగ్గుతాయని, దీంతో ఆదాయం పెరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఈఓలు రమేష్, మాధవి, రాజు కుమార్, రైతులు డప్పూర్ సంగారెడ్డి, ఈదులపల్లి సంగమేశ్వర్ పాల్గొన్నారు.

**చేర్యాలలో...**

**కంది, జూన్ 4, ప్రభాతవార్త:** మండలపరిధిలోని చేర్యాలలో బుధవారం రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ కిషన్, డాక్టర్ సత్యనారాయణలు మాట్లాడుతూ పంటల సాగులో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్దతులపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏఈఓ వై భీనా, ఎ.ఆంజనేయులు, పంచాయితీ కార్యదర్శి సుధీర్‌రెడ్డి, ఆత్మ డైరెక్టర్ యుసూఫ్ ఖాన్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సారా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రవణ్‌కుమార్, రైతులు అబ్దుల్‌రెహమాన్, యండి మహమ్మద్, రమావత్‌రాజు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించిన ఎడిఎ

**కంగ్టి, జూన్ 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాంతీర్థ్ గ్రామంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను బుధవారం వ్యవసాయ సహాయ సంచాలకులు(ఎడిఎ) నూతనకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ రాంతీర్థ్ క్లస్టర్‌పరిధిలో 50 శాతం మంది రైతులు సద్వినియోగం చేసుకున్నారని, మిగతా రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## బీరప్ప ఆలయానికి విద్యుత్..బోరుమోటర్ మంజూరు

**పాపన్నపేట, జూన్ 4, ప్రభాతవార్త :** పాపన్నపేట మండలం కొడుపాకలో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు విద్యుత్ లైను, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ బోరు మోటర్ మంజూరు చేసినట్లు మాజీ సర్పంచ్ వంతుల భూమయ్య తెలిపారు. ఈ నెల 6 నుండి 14 వరకు బీరప్ప ఆలయం వద్ద పోచమ్మ పండుగ, బీరప్ప కళ్యాణం జరుగనున్న నేపథ్యంలో వందలాది భక్తులు రానున్నారని తెలిపారు. గ్రామంలోని కురుమ కులస్తుల అవసరాన్ని అర్థం చేసుకొని, విద్యుత్ సౌకర్యం కల్పించారని చెప్పారు. అలాగే తాగునీటికి ఇబ్బంది కలుగకుండా బోరు వేయించి,సింగిల్ ఫేజ్ బోరు మోటర్ బిగించారని వివరించారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



కొడుపాకలో బోరు వేస్తున్న దృశ్యం